క్లుప్తంగా

నేడు స్పీకర్ పర్యటన

ఆమదాలవలస రూరల్: మండలంలో దూసి గ్రామ పంచాయతీ నెల్లిమెట్ట గ్రామంలో సోమవారం ఉదయం 11.30 గంటలకు జేజేఎమ్ మిషన్ పథకం ద్వారా ఇంటింటికీ తాగునీటి కుళాయి కార్యక్రమానికి శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం శంకుస్థాపన చేయనున్నారు. ఈ మేరకు మండల ప్రత్యేకాహ్వానితుడు తమ్మినేని శ్రీరామ్మూర్తి, జెడ్పీటీసీ సభ్యుడు బెండి గోవిందరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నిమ్మతొర్లాడ పంచాయతీ పరిధిలో గల మర్రికొత్తవలస గ్రామంలో, నెల్లిపర్తి పంచాయతీ పరిధిలో గల సిరిసింపేట గ్రామంలో మధ్యాహ్నం 3.30 గంటలకు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమాలకు మండల స్థాయి అధికారులు, నాయకులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, గ్రామ సచివాలయ సిబ్బంది హాజరుకావాలని కోరారు.

నేడు చల్లవానిపేటలో గడపగడపకు మన ప్రభుత్వం

జలుమూరు: మండలంలోని చల్లవానిపేట గ్రామంలో సోమవారం సాయంత్రం గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ నిర్వహించనున్నారుఆ. ఈ మేరకు ఎంపీపీ వాన గోపి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అధికారుల, ప్రజాప్రతినిధులు, పార్టీలోని అన్ని విభాగల నాయకులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

కళకళలాడిన ఎమ్మార్సీ



ఎంఈఓ రమణకు జాయినింగ్ ఆర్డర్ ఇస్తున్న ఉపాధ్యాయుడు

సారవకోట: ఉపాధ్యాయుల సాధారణ బదిలీలు పూర్తికావడం, వేసవి సెలవుల అనంతరం సోమవారం నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కావడంతో బదిలీలపై వచ్చిన ఉపాధ్యాయులతో ఎమ్మార్సీ కళకళలాడింది. ఇక్కడి నుంచి బదిలీపై ఇతర మండలాలకు వెళ్లిన వారు రిలీవింగ్ ఆర్డర్ల కోసం.. ఇతర మండలాలల నుంచి మండలానికి బదిలీపై వచ్చిన వారు జాయినింగ్ ఆర్డర్ల కోసం ఎమ్మార్సీకి చేరారు. బదిలీలపై వచ్చిన వారు సోమవారం ఆయా పాఠశాలల్లో విధుల్లో చేరనున్నారు.

ఘనంగా ఆలయ ప్రతిష్ట



సామూహిక పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ఎల్‌.ఎన్‌.పేట: మండలంలోని సరడాం గ్రామంలో నిర్మించిన ఉమా నీలకంఠేశ్వర స్వామి ఆలయ ప్రతిష్ట మహోత్సవ పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. మూడు రోజులపాటు జరిగే పూజల్లో భాగంగా ఆదివారం హోమాలు, సూర్యనమస్కారాలు, మహాలింగార్చన, రుద్రాభిషేకాలు నిర్వహించినట్లు ఆలయ అర్చకులు, గ్రామ పురోహితులు తెలిపారు. సరడాంతోపాటు పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ముగిసిన ఆలయ వార్షికోత్సవం



పూజలు అందుకుంటున్న స్వామివారు

సారవకోట: మండలంలోని తొగిరి గ్రామంలో గల యోగ వేంకటేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఆలయంలో స్వామి వారి మూల విరాట్‌ను 10 వేల పూలతో అభిషేకాన్ని అర్చకులు పీసపాటి రామానుజాచార్యులు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్న సంతర్పణ కార్యక్రమం చేపట్టారు.

ముమ్మరంగా వేసవి దుక్కులు



గుండవల్లిపేట వద్ద ట్రాక్టర్‌తో దుక్కి చేస్తున్న రైతు

నరసన్నపేట: ఖరీఫ్‌ పనులకు రైతులు సన్నద్ధవుతున్నారు. వర్షాలు అందిరావడంతో ప్రస్తుతం వేసవి దుక్కులు బిజీలో రైతులు ఉన్నారు. వెద చల్లేందుకు పొలాలను సిద్ధం చేస్తున్నారు. ఈ ఖరీఫ్‌కు 21వేల ఎకరాల్లో వరిసాగు అవుతుందని ఏఓ కె.సునీత తెలిపారు.

ప్రభుత్వ నిబంధనలు పాటించాలి

ఎల్‌.ఎన్‌.పేట: ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఈ నెల 12 నుంచి 17వ తేదీ వరకు ఒంటిపూట బడులు నిర్వహించాలని ఎంఈఓ ఎస్‌.శ్రీనివాస్‌ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వేసవి ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున ఉదయం 7.30 గంటలకు పాఠశాలలు తెరవాలన్నారు. ఉదయం 8.30 నుంచి 9 గంటల మధ్యలో రాగి జావ ఇవ్వాలన్నారు. ఉద యం 11.30 గంటలకు మధ్యాహ్న భోజనం పెట్టిన తరువాత విద్యార్థులకు ఇళ్లకు పంపించాలన్నారు. సోమవారం పాఠశాలలు తెరిచే రోజున విద్యార్థులకు కిట్లు పంపిణీ చేయాలన్నారు.



మెళియాపుట్టి: విజేతలకు బహుమతుల ప్రదానం చేస్తున్న అధికారులు



నరసన్నపేట: గెలుపొందిన విద్యార్థులతో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వీవీజీఎస్‌ శంకరరావు



పాతపట్నం: విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు లింగాల ఉషారాణి

విజ్ఞానం.. వికాసం

- ముగిసిన వేసవి శిక్షణ శిబిరాలు
- విద్యార్థులకు బహుమతుల ప్రదానం



జలుమూరు: మాట్లాడుతున్న సీఆర్పీ పట్ట వైకుంఠరావు

మే 8 నుంచి జూన్‌ 11 వరకు నరసన్నపేట, ఆమదాలవలస, పాతపట్నం నియోజకవర్గాల్లోన్ని పలు గ్రంథాలయాల్లో నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరాలు ఆదివారంతో ముగిశాయి. చిన్నతనం నుంచే కథలు, నవలు, పురాణ గ్రంథాలు అభ్యశించడం ద్వారా, పలు కరాల పోటీల ద్వారా విజ్ఞానం పెరుగుతుందని వక్తలు అన్నారు. శిక్షణ శిబిరాలల్లో నిర్వహించిన లెమన్‌ స్పూన్‌, మేజిక్‌ టేబుల్‌, వ్యాసరచన, డ్రాయింగ్‌, కట్చీఫ్‌, చెస్‌ తదితర పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం చేశారు. ఎంఈఓలు, ప్రజాప్రతినిధులు, గ్రంథాలయ అధికారులు పాల్గొన్నారు. పాతపట్నం శాఖా గ్రంథాలయానికి 25 కుర్చీలను జెడ్పీటీసీ సభ్యురాలు ఉషారాణి, పలాస వ్యవసాయశాఖ ఏడీ ఎల్‌.వి.మధు వితరణగా అందజేశారు.

– సాక్షి నెట్‌వర్క్‌



కొత్తూరు: చిన్నారులకు బహుమతులు అందజేస్తున్న కొత్తూరు సర్పంచ్‌ పడాల కృష్ణవేణి

ఇంటింటికీ స్వచ్ఛమైన తాగునీరు

- జల్‌ జీవన్‌ మిషన్‌ పనులను వేగవంతం చేయాలి
- స్పీకర్‌ తమ్మినేని సీతారాం



అధికారులతో సమీక్షిస్తున్న స్పీకర్‌ తమ్మినేని సీతారాం

ఆమదాలవలస: రాష్ట్రంలోని ప్రతీ గడపకు స్వచ్ఛమైన తాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఏపీ శాసనసభాపతి తమ్మినేని సీతారాం అన్నారు. ఆదివారం తన నివాసంలో జల్‌ జీవన్‌ మిషన్‌ పనులపై సంబంధిత శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్పీకర్‌ మాట్లాడుతూ స్వచ్ఛమైన గాలితో, పాటు స్వచ్ఛమైన నీరు, సంపూర్ణ పోషకాహారం ప్రతీ ఒక్కరికి కల్పించి ఆరోగ్యవంతమైన ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడానికి ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌ రెడ్డి సంకల్పించారన్నారు. ఆమదాలవలస నియోజకవర్గంలో ఆమదాలవలస, పొందూరు, బూర్జ, సరుబుజ్జిలి, ఆమదాలవలస మున్సిపాలిటీ పరిధిలో ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరు కల్పనే లక్ష్యం పనిచేస్తున్నామన్నారు. ఇందులో భాగంగా నియోజకవర్గంలో ప్రతి గ్రామంలో దాదాపుగా పనులకు సంబంధించిన ప్రారంభ కార్యక్రమాలను నిర్వహించడం జరిగిందన్నారు. ఇప్పటి వరకు పూర్తయిన వాటిని ప్రారంభించామన్నారు. ఎన్ని గ్రామాల్లో పనులు కొనసాగుతున్నాయో సంబంధిత శాఖ అధికారులను ప్రశ్నించారు. నిర్దేశిత లక్ష్యానికి పనులు పూర్తికావాల్సిందేనని తేల్చి చెప్పారు. పనులు జరుగుతున్న తీరుపై, అధికారుల పర్యవేక్షణ ఉండాలన్నారు. ఇప్పటివరకు ప్రారంభించిన పనులు శతశాతం ఎప్పటికి పూర్తి చేస్తారో స్పష్టత ఇవ్వాలన్నారు. సీఎం ఆలోచనలు, ఆశయాలకు అనుగుణంగా అధికారులు పనిచేయాలన్నారు. ప్రత్యే కంగా ఆమదాలవలస మున్సిపాలిటీ పరిధిలో ఇంటింటికీ కుళాయిల ద్వారా తాగునీరు కల్పనకు చర్యలు చేపట్టామన్నారు. ఇందుకోసం ఏఐబీపీ సంస్థ ఆర్థిక సహకారంతో పనుల ప్రారంభానికి శ్రీకా రం చుట్టామన్నారు. ఈ విషయంలో తాను అడిగిన వెంటనే, నిధుల మంజూరుకు ముఖ్యమంత్రి ఆమో దం తెలిపారన్నారు. నాగావళి నది నుంచి నీటిని లిఫ్ట్‌ చేసి శుద్ధి చేసిన జలాన్ని ప్రతీ ఇంటికి అందించ డమే ప్రధాన ఉద్దేశమన్నారు. ఇప్పటివరకు జరిగిన పనుల వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆర్‌డబ్ల్యూఎస్‌ ఎస్‌ఈ డి.ఎస్‌.ప్రసాద్‌, డీఈ సూర్యనారాయణ, నాలుగు మండలాలు ఏఈలు పాల్గొన్నారు.

సీఎం జగన్‌ రుణం తీర్చుకుంటాం



ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్‌ను కలిసిన కాంట్రాక్ట్‌ హెల్త్‌ అండ్‌ లెక్చరర్ల సంఘాల నాయకులు

- ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్‌ను కలిసిన కాంట్రాక్ట్‌ ఉద్యోగులు

పోలాకి: జీవితంలో ఎన్నటికీ నెరవేరదనుకునే కలను నిజం చేసి, మా కుటుంబాలకు మేలు చేసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రుణం తీర్చుకుంటామని కాంట్రాక్ట్‌ హెల్త్‌ అండ్‌ లెక్చరర్ల సంఘాల నాయకులు ఆదివారం మాజీ డిప్యూటీ సీఎం, ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్‌ను మబగాం లోని క్యాంప్‌ కార్యాలయంలో కలిశారు. కొత్తగా జీపీఎస్‌ తీసుకురావటం, కాంట్రాక్ట్‌ ఉద్యోగుల క్రమబద్ధీకరణ, ప్రభుత్వంలో ఏపీవీపీ ఉద్యోగుల విలీనం, పీఆర్సీ ఏర్పాటు సహా కేబినేట్‌లో ఉద్యోగుల సంక్షేమం కోసం తీసుకున్న నిర్ణయాలపై హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణదాస్‌ మాట్లాడుతూ ఇచ్చిన ప్రతీ హామీని నెరవేర్చేందుకు సీఎం జగన్‌ నిరంతరం కృషిచేస్తున్నారని, ఇప్పటికే దాదాపు అన్ని హామీలు నెరవేర్చారన్నారు. రానున్న ఎన్నికల్లో 175 స్థానాలు సాధిస్తామన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ ఎమ్మెల్యేను సంఘం నాయకులు సత్కరించారు.

గ్రామ దేవతకు చల్లదనం



ముర్రాటలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

కొత్తూరు: మండలంలోని మెట్టూరు బిట్‌–1 ఆర్‌ఆర్‌ కాలనీలోని కృష్ణాపురానికి చెందిన గ్రామ దేవత ఉత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. లోక కల్యాణార్థం గ్రామస్తులు సామూహికంగా ముర్రాటలతో గ్రామ దేవతకు చల్లదనం చేశారు. వందలాది ముర్రాటలతో మహిళలు ఊరేగింపుగా.. గ్రామ దేవతకు చల్లదనం చేశారు. గ్రామంలో ఉన్న రాజరాజేశ్వరి ఆలయంలో, శివాలయంలో గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉపవాసాలతో ఉన్న గ్రామస్తులు మొక్కులు చెల్లించిన తరువాత ప్రత్యేక భోజనాలు ఏర్పాటు చేశారు. కాలనీకి చెందిన గ్రామ పెద్దలు, యువకులు నిర్వహించారు.

14న నీలమణిదుర్గ ఆలయ హుండీ కానుకల లెక్కింపు

పాతపట్నం: ఈ నెల 14వ తేదీన ఉత్కలాంధ్రుల ఆరాధ్య దైవం పాతపట్నం నీలమణిదుర్గ ఆలయ హుండీ కానుకలను లెక్కించనున్నారు. ఉదయం పది గంటలకు లెక్కింపు ప్రారంభించనున్నట్లు ఆలయ ఈఓ టి.వాసుదేవరావు ఆదివారం తెలిపారు. దేవదాయశాఖ అధికారులు, ఆలయ కమిటీ చైర్మన్‌, ధర్మకర్తలు, భక్తుల సమక్షంలో లెక్కింపు ఉంటుందన్నారు. లెక్కింపునకు ఆసక్తి ఉన్న భక్తులు డ్రెస్‌కోడ్‌ పాటించి హాజరుకావాలని ఈఓ కోరారు.

వైభవంగా రాధాకాంత స్వామి కల్యాణం



రాధాకాంత స్వామి కల్యాణాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

కొత్తూరు: మండలంలోని గూనభద్ర ఆర్‌ఆర్‌ కాలనీలో రాధాకాంత స్వామి ఆలయ 13 వార్షికోత్సవం ముగింపు సందర్భంగా ఆదివారం స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. సర్పంచ్‌ కె.వాణి, వైకుంఠరావు దంపతులతో వేద పండితులు కల్యాణం జరిపించారు. వార్షికోత్సవం సందర్భంగా మూడు రోజులపాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు ప్రసాదరావు పండా, ఆర్‌ఆర్‌ కాలనీకి చెందిన భక్తులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్‌ కోర్సుపై అవగాహన

ఆమదాలవలస రూరల్‌: పాలిటెక్నిక్‌ కళాశాలలో చేరాలనుకునే ఔత్సాహిక విద్యార్థులకు డిప్లొమా, పాలిటెక్నిక్‌ విద్య గురించి అవగాహన కల్పించేందుకు అన్ని ప్రభుత్వ పాలిటెక్నిక్‌ కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆమదాలవలస కళాశాల ప్రిన్సిపాల్‌ కె.నారాయణరావు ఆదివారం ఒక ప్రకటన లో తెలిపారు. ప్రభుత్వ పాలిటెక్నిక్‌ కళాశాలల్లో ఈ నెల 12 నుంచి అవగాహన కార్యక్రమం ప్రారంభించి రెండు వారాలపాటు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు.

ఘనంగా సీతారాముల విగ్రహాల ప్రతిష్ట



వేద పండితుడిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్‌

పోలాకి: మండలంలోని మబగాం పంచాయితీ పూనివానిపేటలో సీతారాముల విగ్రహాలను గ్రామస్తులు ఆదివారం ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా రెండు రోజులపాటు ప్రత్యేక పూజాకార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నారు. బ్రహ్మశ్రీ శృంగారం లక్ష్మీ ధనుంజయ శర్మ ఆధ్వర్యంలో జరుగుతున్న కార్యక్రమానికి ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్‌ తన సోదరుడు రాందాస్‌తో కలసి హాజరయ్యారు. ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్యే అన్నారు. ఆ కార్యక్రమంలో భాగంగా వేద పండితులను ఎమ్మెల్యే కృష్ణదాస్‌ సత్కరించారు.

శ్మశాన వాటికకు రహదారి నిర్మాణం



రోడ్డు నిర్మాణం చేపడుతున్న దృశ్యం

బూర్జ: మండలంలోని తమ్మినాయుడుపేటలో గల శ్మశానవాటికకు సీసీ రోడ్డు నిర్మాణం చేపడుతున్నట్లు వైఎస్సార్‌సీపీ సీనియర్‌ నాయకుడు మూడడ్ల సత్యనారాయణ ఆదివారం తెలిపారు. గ్రామంలో ఎన్నో ఏళ్ల నుంచి శ్మశాన వాటికకు రోడ్డు లేక అంతిమ యాత్ర సమయంలో ఇబ్బంది పడేవారన్నారు.

ప్రశాంతంగా మోడల్‌ స్కూల్‌ ప్రవేశ పరీక్ష



పాతపట్నం: ప్రవేశ పరీక్ష రాస్తున్న విద్యార్థులు

పాతపట్నం: పాతపట్నం ప్రభుత్వ మోడల్‌ స్కూల్‌ ఆరో తరగతి ప్రవేశ పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. ప్రభుత్వ మోడల్‌ స్కూల్‌లో 7 గదుల్లో మొత్తం 169 మంది విద్యార్థులకు 155 మంది హాజరయ్యారని ప్రిన్సిపాల్‌ రత్నకుమారి తెలిపారు. ఉదయం పది గంటల నుంచి 12 గంటలకు వరకు పరీక్షలు నిర్వహించినట్లు పరీక్షల డీపార్ట్‌మెంట్‌ అధికారి బి.అనిల్‌ కుమార్‌ తెలిపారు.

14 మంది గైర్హాజరు

పొందూరు: మండలంలోని వావిలపల్లిపేట మోడల్‌ స్కూల్లో ఆరో తరగతిలో ప్రవేశాలకు ఆదివారం పరీక్ష నిర్వహించారు. 189 మందికి 14 మంది గైర్హాజరైయ్యారని చీఫ్‌ సూపరింటెండెంట్‌ హెచ్‌.ప్రభాకర్‌ తెలిపారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించామన్నారు. తొమ్మిది గదుల్లో విద్యార్థులు పరీక్షలు రాశారన్నారు. డీఓ పాపారావు పర్యవేక్షించారు.

67 మందికి కంటి పరీక్షలు



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్‌ భారతి

ఎల్‌.ఎన్‌.పేట: కంటి సంబంధిత వ్యాధుల పట్ల ప్రతీ ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని కంటి డాక్టర్‌ భారతి అన్నారు. మండలంలోని బొర్రంపేట గ్రామంలో ఆదివారం డాక్టర్‌ వైఎస్సార్‌ కంటి వెలుగు, జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో శంకర్‌ ఫౌండేషన్‌ ఆస్పత్రి డాక్టర్లు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామానికి చెందిన 67 మందికి కంటి సంబంధిత పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు ఉచితంగా అందజేశారు. 22 మందికి కంటి శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. వీరికి ఉచితంగానే కంటి శస్త్రచికిత్సలు చేయటం జరుగుతుందన్నారు. బొర్రంపేట సర్పంచ్‌ బొడ్డేపల్లి రమణమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు బొడ్డేపల్లి చిట్టిబాబు, క్యాంప్‌ కో ఆర్డినేటర్‌ సోమేశ్వరరావు, క్యాంప్‌ ఇన్‌చార్జి టి.రామారావు పాల్గొన్నారు.

చెవిటమ్మతల్లి ఉత్సవాలు ప్రారంభం

సారవకోట: మండలంలోని కుమ్మరిగుంట గ్రామంలో చెవిటమ్మ తల్లి గ్రామదేవత ఉత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభమయ్యాయి. మూడు రోజులపాటు నిర్వహించనున్న ఈ ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. కుంకుమార్చనలు, విశేష పూజలు నిర్వహించారు. మహిళలు ఘటాలతో అమ్మవారి ఆలయానికి వెళ్లి పూజలు చేపట్టారు.



ఘటాలతో ఊరేగింపుగా వస్తున్న భక్తులు

ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాలి



మాట్లాడుతున్న జె.జె.మోహన్‌రావు, బొడ్డేపల్లి మోహన్‌రావు

ఆమదాలవలస: పట్టణంలో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాలని ఆమదాలవలస సిటిజన్‌ ఫోరం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జె.జె.మోహన్‌రావు, బొడ్డేపల్లి మోహన్‌రావు అధికారులను కోరారు. సిటిజన్‌ ఫోరం కార్యాలయంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. పట్టణంలో ట్రాఫిక్‌ అస్తవ్యస్తంగా ఉండడంతో ఎప్పటికప్పుడు రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ప్రధాన రహదారిని ఆక్రమించి ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కల్పిస్తున్న కొంతమంది ఆక్రమణదారులపై చర్యలు చేపట్టాలని కోరారు. నడిరోడ్డుపై మాంసం విక్రయాలతో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయన్నారు. తోపుడు బండ్లు, పండ్ల వ్యాపారులకు ప్రత్యేక స్థలం కేటాయించేలా మున్సిపల్‌, పోలీసు అధికారులు చర్యలు చేపట్టాలన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత



సత్సంగంలో పాల్గొన్న భక్తులు

బూర్జ: ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత కలుగుతుందని సత్యసాయి సేవా సభ్యుడు, పాలకొండ ప్రతినిధి ఎస్‌.వి.రమణ అన్నారు. మండలంలోని పెద్దపేటలో గ్రామ పెద్దల ఆధ్వర్యంలో దివ్య జీవన ప్రథమ సత్సంగ ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎస్‌.వి.రమణ మాట్లాడుతూ మోక్షానికి గల తొమ్మిది మార్గాలను వివరించారు. పార్వతీపురానికి చెందిన కంచుమోజు రామ్మోహన్‌రావు, పెద్దపేట డి.యోగేశ్వరరావు, తెట్టంగి కె.సత్యనారాయణ, వి.స్వామినాయుడు పాల్గొన్నారు.

జమ, ఖర్చుల వివరాలు వెల్లడి



జమ, ఖర్చుల వివరాలు తెలియజేస్తున్న కమిటీ ప్రతినిధులు

పాతపట్నం: నీలమణిదుర్గ అమ్మవారి పెద్దపండగలు అందరి సహకారంతో విజయవంతం అయ్యాయని ఉత్సవ హెడ్‌ కమిటీ ప్రతినిధులు అన్నారు. స్థానిక జగన్నాథ స్వామి ఆలయంలో ఉత్సవ జమ, ఖర్చులపై ఆదివారం గ్రామ సభ నిర్వహించారు. అన్ని శాఖల అధికారులు, ప్రజల పూర్తిస్థాయి కృషితోనే పది రోజుల పాటు పండగలు ప్రశాంతంగా జరిగాయన్నారు. అందరికీ హెడ్‌ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సంవత్సరం ఉత్సవాలకు చందాల రూపంలో రూ.1.30 కోట్లు, ఖర్చు రూ.1,03,70,000 అయిందని హెడ్‌ కమిటీ సభ్యులు తెలిపారు. రూ.26.30 లక్షలు మిగిలి ఉన్నాయన్నారు. సమావేశంలో హెడ్‌ కమిటీ సభ్యులు లింగాల మధుబాబు, రవి కుమార్‌, కాళ్ల రాజు, నూలు బుజ్జి, పైల లక్ష్మయ్య, బాబ్జి, మల్లికార్జునరావు, పెద్దింటి అప్పారావు, నూలు ఈశ్వరరావు, కె.యరకయ్య, మధుబాబు, మెట్ట రామారావు పాల్గొన్నారు.